


ధాన్యాన్ని తరలిస్తున్న దృశ్యం

- గ్రామాల్లో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు
- గ్రామాల వారీగా వాహనాలు సమకూర్చి ధాన్యం తరలింపు
- వారంలో పూర్తి చేసేందుకు ఏర్పాట్లు
- రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో ధాన్యం సేకరణ
- తరుగు తీయడంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- హమాలీ చార్జీల వసూళ్లపైనా ఫిర్యాదు

అకాల వర్షాలపై
అధికారుల అప్రమత్తం

నిజామాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోవడం, రైతులు ఇబ్బందులు గురవుతుండడంపై పౌరసరఫరాల శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. గ్రామాల్లో రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన సేకరించేందుకు చర్యలు చేపట్టారు. తడిసిన ధాన్యంతోపాటు ఇతర ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వెంటవెంటనే లారీలను పంపిస్తూ ధాన్యాన్ని మిల్లులకు చేరవేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని తీసుకునేందుకు మిల్లర్లు వెనకాడుతున్నా వారిని ఒప్పించి ధాన్యాన్ని అన్‌లోడ్ చేసే విధంగా చూస్తున్నారు. మరో వారం రోజుల్లో పూర్తి ధాన్యాన్ని సేకరించే విధంగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లాలో భారీగా ధాన్యం కొనుగోలు చేసి చివరగా కొద్ది ధాన్యం ఉన్న సమయంలో ఈ వర్షాలు పడుతుండటంతో సేకరణకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో తడిసిన ధాన్యం అధికారులు కొనుగోలు చేస్తున్న మిల్లర్లు మాత్రం ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి పంపించిన తర్వాత బస్తాకు 5 కిలోల వరకు ధాన్యాన్ని తరుగు తీస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు రైతులతో పాటు రైతు సంఘాల నేతలు ఫిర్యాదులు చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి నిబంధనలు పెట్టకుండా తీసుకోవాలని కోరుతున్నారు. హమాలీల చార్జీల వసూళ్లలో సొసైటీ అధికారులు ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

రెండు నెలలుగా కొనుగోళ్లు

జిల్లాలో గత రెండు నెలలుగా ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 700 వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధికంగా 8లక్షల 18వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని సేకరించారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 7లక్షల 30వేల మెట్రిక్ టన్నుల వరకు సన్నరకాన్ని కొనుగోలు చేశారు. రాష్ట్రస్థాయిలో ధాన్యం సేకరణలో జిల్లా ముందుండగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా జిల్లా అధికారులను అభినందించారు. జిల్లాలోని ఆర్మూర్, ఆలూర్, బాల్కొండ, మెండోరా, మోర్తాడ్, జక్రాన్‌పల్లి మండలాల పరిధిలో రైతుల వద్ద ఉన్న మిగిలిన ధాన్యాన్ని సేకరించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. మరో 20వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం ఉంటుందని అంచనాకు వచ్చారు. అకాల వర్షాలు ఆరు రోజులుగా పడుతుండటంతో కొన్నిచోట్ల ధాన్యం తడిసి మొలకెత్తింది. కొన్ని గ్రామాల పరిధిలో రైతులు సంచులను నింపి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. తడవని ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయడంతో పాటు మిల్లులకు తరలిస్తున్నారు. గ్రామాల వారిగా ధాన్యం ఉన్న రైతుల వివరాలను పరిశీలించడంతో పాటు ఆయా సొసైటీలు, మహిళా గ్రూపుల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు వాహనాలను సమకూర్చి ఏరోజుకు ఆరోజు మిల్లులకు తరలిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా బాయిల్డ్ మిల్లుల యజమానులతో మాట్లాడి కొనుగోలు చేస్తున్నారు. ఆ మిల్లులకు తడిసిన ధాన్యాన్ని పంపిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొన్ని మిల్లుల యజమానులు తీసుకునేందుకు నిరాకరించిన వారితో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో పాటు పౌరసరఫరా శాఖ అధికారులు, సహకారశాఖ అధికారులు కలిసి మాట్లాడి ధాన్యాన్ని దించుకునేలా ప్రయత్నాలు చేశారు. గ్రామాల్లో ధాన్యం నిల్వలు ఉన్న రైతులకు విజ్ఞప్తి చేయడంతో పాటు తడవకుండా ఉండే విధంగా టార్పాలిన్‌లు కూడా అందరికి సరఫరా చేశారు. సంచులను నింపడంతో పాటు వరద రాని చోట పెట్టేవిధంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

తడిసిన ధాన్యానికి 5 నుంచి 10కిలోల తరుగు!

జిల్లాలో తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి మిల్లర్లకు పంపిస్తున్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిమిల్లుల యజమానులు ధాన్యాన్ని దించుకునేందుకు ఇబ్బందులు పెడుతున్నారు. తడిసిన ధాన్యానికి క్వింటాకు 5 నుంచి 10కిలోల వరకు తరుగు తీస్తేనే దించుకుంటున్నారు. కొన్ని మిల్లర్లు ధాన్యాన్ని కూడా తిప్పి పంపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యానికి మిల్లుల్లోకి వెళ్లిన తర్వాత ధాన్యానికి చాలా తేడాలు వస్తున్నాయి. ఈ విషయాన్ని పలు రైతు సంఘాల నేతలు జిల్లాఅధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు దృష్టికి తీసుకువెళ్లారు. తరుగు తీయకుండా చూడాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన ధాన్యానికి అనుగుణంగానే ట్రక్‌షీట్‌లో కూడా ఎలాంటి తరుగు తీయకుండా ఉండాలని వారు కోరుతున్నారు. పూర్తిస్థాయిలో చర్యలు తీసుకొని రైతులకు ధాన్యం సేకరణ చివరి సమయంలో ఇబ్బందులు పెట్టవద్దని కోరుతున్నారు. ధాన్యం సేకరణలో హమాలీల చార్జీలు కూడా ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారని రైతు సంఘాల నేతలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బస్తాకు రూ.18 వరకు వసూలు చేస్తూ హమాలీలకు మాత్రం 12 నుంచి 13 రూపాయల వరకే ఇస్తున్నారని తెలిపారు. రైతులకు నష్టం కలిగిస్తూ సొసైటీ అధికారులు దోచుకుంటున్నారని వారు అధికారులకు విన్నవిస్తున్నారు. అర్గుల్, రైమత్‌నగర్‌తో పాటు ఇతర మండలాల పరిధిలోని గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని మిల్లులకు పోతే తరుగు భారీగా తీశారని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో మాత్రం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే విధంగా ఏర్పాట్లు చేశామని పౌరసరఫరా సంస్థ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, శాఖ జిల్లా అధికారి అర్వింద్‌రెడ్డిలు తెలిపారు. ప్రతీరోజు గ్రామాలను పర్యటించి హమాలీలను సమకూర్చి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. మిల్లుల వద్ద కూడా అధికారులను నియమించి అన్‌లోడ్ అయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. వారం రోజుల్లోగా మొత్తం ధాన్యాన్ని కొనుగోలు పూర్తి చేస్తామని తెలిపారు.



కోటగిరిలో నమూనా ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న పోచారం

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

కోటగిరి,మే30 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా సాకారం చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యేపోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పొతంగల్ మండలంలోని హంగర్గ ఫారంలో 40మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతో కలిసి భూమిపూజ చేశారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని 510 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందు కోటగిరి మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మించిన మోడల్ ఇంటిని ప్రారంభించారు. ఇంటి నిర్మాణ పనుల ఖర్చు గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సొంత ఇల్లు అవసరం అవసరమని, దీన్ని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా పేదలకు ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేస్తున్న ఘటన కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. దీన్ని లబ్ధిదారులు పైసా కట్టాల్సిన అవసరం లేదని, ఇళ్ల మంజూరీ కోసం ఎవరికి ముడుపులు ఇవ్వొద్దని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక కులమతాలు, రాజకీయాలకు అతీతంగా చేస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఉచితంగా, తక్కువ ధరకు ముడి సరుకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా బాన్సువాడలో 11వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించామన్నారు.

• ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్ల మంజూరు: కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతలో ఇంటి స్థలాలను కలిగి ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని, ఒక్కో నియోజకవర్గానికి మొదటి విడతగా 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. లబ్ధిదారులు చేపట్టే నిర్మాణ దశలను అనుసరిస్తూ నాలుగు విడతలలో రూ.5లక్షలను లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామన్నారు. బేస్‌మెంట్ లెవల్ (మిగతా 6వ పేజీలో..)

సాగు కోసం రైతన్న సమాయాత్తం

- సన్న వరి సాగా.. దొడ్డు వరి సాగు చేద్దామా?
- సన్నాల బోనస్ కోసం ఎదురు చూపులు



5

ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించిన కేంద్ర బృందం



అధికారులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

ఆర్మూర్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామాన్ని కేంద్ర బృందం శుక్రవారం సందర్శించింది. గ్రామంలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో కేంద్ర బృందం సభ్యులు శిఖాసిన్హా, విక్రంసింగ్ గుర్జార్, సుదేష్ కంసాల పరిశీలించారు. అనంతరం ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బ్రహ్మానందం, ఎంఈవో రాజ్‌గంగారాం, ఎంపీవో శ్రీనివాస్‌లతో పథకాల అమలు తీరుపై చర్చించారు.

టీపీసీసీ కమిటీలలో జిల్లా నేతలకు చోటు

నిజామాబాద్ అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఐదు కమిటీలను ఏఐసీసీ గురువారం రాత్రి ప్రకటించగా జిల్లాకు చెందిన పలువురు నాయకులకు కమిటీలలో చోటు దక్కింది. రాజకీయ వ్యవహారాల కమిటీతో పాటు సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీ, సలహా కమిటీ, డీలిమిటేషన్, క్రమ శిక్షణ కమిటీలను వేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌లకు రాజకీయ వ్యవహారాల కమిటీలో చోటు దక్కింది. సలహాకమిటీలో మాజీ ఎంపీ మధుయాష్కికి చోటు దక్కింది. సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీలో నగరానికి చెందిన మాజీద్‌ఖాన్‌కు చోటు దక్కింది. అదేవిధంగా క్రమ శిక్షణ చర్యల కమిటీలో నగరానికి చెందిన డాక్టర్ జీవీ రామకృష్ణకు చోటు దక్కింది.



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు

- సమష్టిగా కృషి చేసి స్థానిక సంస్థల బాగా ఎన్నికల్లో సత్తాచాటాలి
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నిజామాబాద్‌అర్బన్, మే30 (ఆంధ్రజ్యోతి): పార్టీ జెండా పట్టి కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు కేశ వేణు ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నబియ్యం పంపిణీ, కులగణన వంటి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనన్నారు. కార్యకర్తలంతా సమిష్టిగా పనిచే యాలన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారిని ఎప్పుడూ గుర్తుంచుకుంటామని వారికే పదవు లైనా, అభివృద్ధి పథకాలైనా అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. 2017 కంటే ముందు ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులకే మండల, పట్టణ, అధ్యక్ష పదవులు ఉంటాయని ఆయన అన్నారు. 50వేలు, లక్ష రూపాయల రాజీవ్ యువ వికాసం రుణాల కోసం బ్యాంకులో సిబి ల్ అవసరం లేదన్నారు. అర్హులైన వారందరికి రుణాలు అందజేస్తామన్నారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు వాతంటత అవే పదవులు వస్తాయన్నారు. జిల్లా ఇంచార్జి తిరుపతి మా ట్లాడుతూ డివిజన్ అధ్యక్షుల నియామకంలో స్థానిక నాయకులంతా ఏకగ్రీవంగా ఒక పేరును సూచించి నగర అధ్యక్షుడికి ఇవ్వాలని ఆయన సూచించారు. సమావేశంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పార్టీ సీనియర్ నాయకులు రత్నాకర్, జావిద్ అక్రమ్, రామకృష్ణ, రాజేంద్రప్రసాద్‌తో పాటు వివిధ డివిజన్ నాయకులు, కార్యకర్తలున్నారు.



- మారని జీజీహెచ్ నిర్వహణా తీరు
- ఆక్సిజన్ ప్లాంటు ఉన్నా ఫిల్లింగ్ కరువు
- అడుగడుగునా రోగులకు అవస్థలు
- పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం



తాగునీటి కుళాయి వద్ద ఇదీ పరిస్థితి..



పైపులు పగిలి ప్రవహిస్తున్న మురికి నీరు

సూది మందుకూ దిక్కు లేదు!

నిజామాబాద్‌అర్బన్, మే30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పేరు వింటేనే రోగులు, వారి సహాయకులు హడలెత్తే పరిస్థితులు ఇంకా మారడం లేదు. సూపరింటెండెంట్ స్థాయి అధికారిణి వ్యవహార శైలిపై వివాదాలు చుట్టుముట్టి చివరికి మార్పు జరిగినా సేవల్లో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. కేవలం రూ.1, రూ.2 విలువచేసే సూది మందులు సైతం పెద్ద ఆసుపత్రిలో అందుబాటులో లేని పరిస్థితి ఉందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. పాలనాపరంగా కఠినంగా వ్యవహరిస్తున్నామని గొప్పలు చెప్పుకునే సంబంధిత ఉన్నతాధికారులు మందుల కొరతపై నోరు ఎందుకు మెదపరని రోగులు, వారి సహాయకులు ప్రశ్నిస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణ దగ్గరి నుంచి చికిత్సలు, టెస్టులు, ఓపీ, ఐపీ అంతా గందరగోళమే నెలకొంది. జీజీహెచ్‌కు ప్రభుత్వం నుంచి రకాల మందులు, ఇంజెక్షన్లు సరఫరా చేస్తోందని చెబుతున్నా రూ.2, రూ.4, రూ.10 విలువ చేసే ఇంజెక్షన్లు కూడా ఇక్కడ ఉండడం లేదు. అత్యవసర మందులు లేక రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఆక్సిజన్ ప్లాంట్ ఉన్నప్పటికీ ఫిల్లింగ్ లేకపోవడంతో ఎక్స్‌రే, స్కానింగ్ వంటి వాటికి రోగులను తీసుకెళ్లేందుకు ఇబ్బందులు వస్తున్నాయి. బయట నుంచి చిన్న ఆక్సిజన్ సిలిండర్లు, పెద్ద ఆక్సిజన్ సిలిండర్లను కొనుగోలు చేసి తీసుకు రావాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవలనే రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి జిల్లా ఆసుపత్రిపై సమీక్ష నిర్వహించి మరమ్మతులు చేస్తామని నిధులు విడుదల చేసిన ఇంకా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇటీవల ఆసుపత్రిలో పెచ్చులు ఊడి చిన్నారి గాయ పడిన ఘటన జరిగిన మరమ్మతుల విషయంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా ఆసుపత్రిలో పారిశుధ్యం వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. తాగునీరు తాగే ప్రదేశంతో పాటు మురికి నీరు వెళ్లే పైప్‌లైన్ వ్యవస్థ అధ్వాన్నంగా ఉండి ఆసుపత్రి నిర్వాహన లోపాన్ని తేటతెల్లం చేస్తుంది.



ఎక్స్‌రే కోసం వేచి ఉన్న రోగులు

మరమ్మతులు కరువు

జీజీహెచ్ భవనం పెచ్చులూడినా.. పైపులు పగిలినా పట్టించుకునే వారు లేరు. ఇటీవల పెచ్చులూడి ఓ చిన్నారికి గాయాలయ్యాయి. జీజీహెచ్ పరిసరాలు కంపుకొడుతున్నాయి. డ్రైనేజీ నీరు ఎక్కడపడితే అక్కడ ప్రవహిస్తోంది. గతంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఆసుపత్రిని సందర్శించిన క్రమంలో మరమ్మతులకు నిధులు విడుదల చేస్తానని చెప్పారు. ఇటీవల సమీక్షలోనే నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. అయినా మరమ్మతుల్లేక ఆసుపత్రి పాత భవనాన్ని తలపించేలా కనిపిస్తుంది.

మీడియాపై ఆంక్షలు

ఆసుపత్రి నిర్వహణను గాలికి వదిలేసిన అధికారులు మీడియాపై మాత్రం ఆంక్షలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. జీజీహెచ్‌లో ఫొటోలు, వీడియోలు తీయడం నిషేధమని పోలీ సుల చేత ఇబ్బందులకు పాల్పడు తున్నారు. ఎవరైనా ఫొటో, వీడియో తీస్తే వాటిని డిలెట్ చేయిస్తున్నారు.

ఆసుపత్రిలో సరఫరా కాని మందులు ఇవే..

జిల్లా ఆసుపత్రికి ప్రభుత్వం నుంచి 500 రకాలకు పైగా మందులు, ఇంజెక్షన్‌లు సరఫరా అవుతున్నా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఇచ్చే ఇంజెక్షన్లు మాత్రం సరఫరా కాకపోవడంతో వాటిని బయట నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. బీపీ, (మిగతా 6వ పేజీలో..)



అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సంఘ సభ్యులు

జాతీయ స్థాయిలో మహిళా సంఘాలకు అవార్డులు

నిజామాబాద్ అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో భాగంగా మహిళా సంఘ సభ్యులను లక్షాదికారులను చేసే లక్ష్యంలో ఉత్తమ ప్రతిభకనబర్చిన జిల్లాకు చెందిన మహిళా సంఘ సభ్యులకు జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చాయి. భువనేశ్వర్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా మొదటిస్థానంలో ఉండగా నందిపేట మండల సమైక్య రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఒరిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ చేతుల మీదుగా లక్‌పతి దీదీ కన్‌క్లేవ్ 2025లో భాగంగా ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో జరిగిన కార్యక్రమంలో నందిపేట మండలంలోని సీహెచ్ కొండూర్‌కు చెందిన మంగు లావణ్య, నందిపేట గ్రామ సంఘం-2 ఏపీఎం మాణిక్యంలు శుక్రవారం అవార్డును అందుకున్నారు. ఈ మేరకు డీఆర్‌డీవో సాయాగౌడ్, తదితరులు అభినందనలు తెలిపారు.

నా పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదు

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): తన పేరు చెప్పి అధికారులపై దురుసుగా ప్రవర్తించినా, డబ్బులు వసూలు చేసినా సహించేది లేదని ఎవరైనా సరే పార్టీ నుంచి సస్పెండ్ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని వీవీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు ప్రజలకు నేరుగా చేరుతాయని, ఎవరు కూడా మధ్యవర్తులను నమ్మి డబ్బులు ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్ ఇట్టెం జీవన్, నాయకులు మారుతిరెడ్డి, పోతు నర్సయ్య, శేఖర్‌రెడ్డి, కొంతం మురళి, నీరజ్, శ్యాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

డొంకేశ్వర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వభూమిని ఆక్రమించి భవన నిర్మాణాన్ని చేపడుతున్నారని డొంకేశ్వర్ గ్రామస్థులు శుక్రవారం ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రధానరోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపడుతు న్నా రని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి కబ్జాకాకుండా అధికారు లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు ప్రజు తదితరులు పాల్గొన్నారు.

అన్నారం గ్రామంలో శాఖాహార ర్యాలీ

డొంకేశ్వర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మూగజీవాల సంరక్షణ కోసం అహింసాయుత మహాకరణ శాఖాహార ర్యాలీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ సొసైటీ మూమెంట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి తెలిపారు. డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధాన్య, జ్ఞాన, శాకాహార ర్యాలీ కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి అతిథులుగా హిమాలయ యోగి, స్థితనందా సరస్వతి, కేదారేశ్వర ఆశ్రమ వ్యవ స్థాపకులు మంగి రాములు మహారాజ్ హాజరవుతున్నామన్నారు.

పీసీసీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా అనిల్ నియామకంపై హర్షం

మెండోర, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పొలి టికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యుడిగా నియామకంపై వేల్పూర్ మార్కె ట్‌కమిటీ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈరవత్రి అనిల్ నియామకా నికి కృషిచేసిన సోనియాగాంధీ, మల్లికార్జునఖార్గే, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్‌లకు మండల కాంగ్రెస్ నాయ కులు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

బోధన్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఉద్మీర్ గల్లీకి చెందిన తాహెర్ అనే వ్యక్తిని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పకడ్బందీ సమాచారం మేరకు దాడులు నిర్వహించి అతనిని పట్టుకోగా అతని వద్ద 130గ్రాముల ఎండు గంజాయి లభించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి విక్రయించిన, గంజాయి తాగిన, సరఫరా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తొర్లికొండలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జక్రాన్‌పల్లి, మే30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండలో శుక్రవారం 15 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఆర్మూర్ మార్కెట్ కమి టీ డైరెక్టర్ కనకరవి, బ్రాహ్మన్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. తొర్లికొండ గ్రామానికి చెం దిన 15 మంది లబ్ధిదారులకు కలిపి 3 లక్షల 40వేల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడ కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిరెడ్డి, రాకేష్, వినోద్, కైలాస్, సంతోష్‌యాదవ్, రణవీర్, గ్రామశాఖ అధ్యక్షుడు తాజొద్దిన్ పాల్గొన్నారు.

ఒకే దఫా మూడునెలల బియ్యం ఇవ్వాలి

వర్ని, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన మూడునెలల సన్న బియ్యం ఒకే విడతలో ఇవ్వాలని వర్ని తహసీల్దార్ సాయిలు ఆదేశించారు. శుక్రవారం రేషన్‌డీలర్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయపాలన పాటిస్తూ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా బియ్యం పంపిణీ చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఉప తహసీల్దార్ మమత, ఆర్‌ఐలు శ్యాంకుమార్, అనురాధ, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అతిమల నగేష్, అజయకుమారి పాల్గొన్నారు.

కాలువ నిర్మాణానికి సర్వే



భీమ్‌గల్‌లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

భీమ్‌గల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని మొగిలి చెరువు నుంచి రాతం చెరువు వరకు కాలువ నిర్మాణం కోసం రెవె న్యూ, ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి సర్వే చేపట్టారు. వర్షాకాలంలో అయ్యప్పనగర్, విద్యానగర్ కాలనీలో డ్రైనేజీలు లేక నీరు నిల్వ ఉండడం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించి కాలువ నిర్మాణానికి ప్రతిపాదించారు. సర్వేలో ఇరిగేషన్ ఈఈ భానుప్రకాష్, తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, ఇరిగేషన్ డీఈ నాగేశ్వర్, ఎస్సై మహేష్, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొరిరే స్వామి, పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, మల్లెల లక్ష్మణ్, రమేష్ తదితరులున్నారు.

డీసీ తండాలో టవర్ నిర్మాణానికి స్థల పరిశీలన

కమ్మర్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి):ప్రైవేట్‌టెలికాం రంగం సంస్థలకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సంస్థ తమ సేవలను మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరించాలన్న ఉద్దేశంలో అవసరమున్న ప్రాతాలలో టవర్ల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నది. ఇందులో భాగంగానే కమ్మర్‌పల్లి మండలం దోమ్మరిసొడు (డీసీ) తండా గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు టవర్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని కమ్మర్‌పల్లి తహసీల్దార్ సి.ప్రసాద్ శుక్రవారం గ్రామాన్ని సందర్శించి బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ శరత్, గ్రామ మాజీ సర్పంచ్ భాస్కర్, గ్రామ గిరిజనులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

బోధన్‌రూరల్,మే30(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మావంది కలాన్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పోతారెడ్డి, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోస్రా : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా శుక్రవారం చందూరు మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారి సొంత స్థలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి ఇళ్లకు ముగ్గులు వేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నీలావతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ లహరి, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు ప్యారం అశోక్, మాజీ సర్పంచ్ కర్లం సాయిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అంబర్ సింగ్, మాజీ ఎంపీపీ లావణ్య రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని జక్రాన్‌పల్లిలో శుక్రవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. అదేవిదంగా అర్గుల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. జక్రాన్‌పల్లిలో 50 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు కాటిపల్లి నర్సారెడ్డి, సొప్పరి వినోద్, వసంత్‌రావు, లావణ్య, నవీనా చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు అక్బర్, మాజీ ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవీపేట : మండలంలోని జన్నేపల్లిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చామంతి రాజు, భట్టు లక్ష్మణ్ రావు, సురేష్, నారాయణ రావు, సాయిలు పాల్గొన్నారు.

వేల్పూర్ : మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం జీపీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు మార్కౌట్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాలమోహన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్‌లు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తమ గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవనీత, కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, టక్కరి గంగాధర్, గట్టవతల నర్సారెడ్డి, నెహ్రూ, లింగేశ్వర్ పాల్గొన్నారు.

ఆలూర్ : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి శుక్రవారం మార్కింగ్, భూమిపూజ పనులను ఎంపీడీవో గంగాధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేద వారికి సొంత ఇంటికలను సాకారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల కమిటి సభ్యుడు ఆమందు సంజీవ్, భాస్కర్, చిరంజీవి, నారాయణ, నాయకులు గంగారెడ్డి, నవనీత్, పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

నందిపేట : మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఆర్మూర్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ భూమి పూజచేశారు. ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు మేతరి వసంత అనే లబ్ధిదారుల ఇంటికి ముగ్గుపోశారు. కార్యక్రమంలో మండల సొసైటీ డైరెక్టర్ తోట మహేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండు హరీష్, పంచాయతీ కార్యదర్శి కండెల నరేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తుక్కన్న ఉన్నారు.

ఎడపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల అభ్యున్నతికి లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆయన వెంట నాయకులు వినోద్, రంజిత్, మహమ్మద్ జిలానీ తదితరులు ఉన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్

రెంజల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పండుగలను కుల,మతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని సాటాపూర్ రైతువేదికలో శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల రవాణా జరగకుండా చూడాలన్నారు. ఆవులు, దూడలను అమ్మవద్దని, రవాణా చేయరాదని, పశువైద్య అధికారి సమక్షంలో ధృవీకరణ పత్రం తీసుకుని గ్రామ పంచాయతీ రసీదు తీసుకోవాలన్నారు. వాహనంలో అధిక మొత్తంలో రవాణా చేయకూడదని సూచించారు. సాటాపూర్ పశువుల సంతలో కొనుగోలు నిర్వహించే వారికి పలు సూచనలు చేశారు. పండుగ సందర్భంగా ఆవు, దూడల అమ్మకాలు చేయకూడదని, ఇతర పశువులను అమ్మేందుకు డాక్టర్‌తో పాటు గ్రామ పంచాయతీ ధృవీకరణ పత్రం తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్కరు కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో పండుగలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ విజయ్ బాబు, పశువైద్య అధికారి విఠల్, ఎస్ఐ చంద్ర మోహన్, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

'గోవధ జరగకుండా చర్యలు చేపట్టండి'

బోధన్‌రూరల్ : గోవధ జరగకుండా చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు శుక్రవారం బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గో సేవాసమితి అధ్యక్షులు సంతోష్ గుప్తా, గోశాల అధ్యక్షులు నేపాల్‌సింగ్ మాట్లాడుతూ బక్రీద్ నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బోధన్ ఎంవీఐ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. వాహనాల్లో సాటాపూర్ తదితర వారాంతపు సంతల నుంచి గోవులను కొందరు అక్రమంగా తరలిస్తున్నారని అటువంటి వారిని పట్టుకుని వాహనాలను సీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపి కిషన్, జనరల్ సెక్రెటరీ రాజులదేవి పవన్‌కుమార్, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్‌వినయ్‌కుమార్

రెంజల్,మే30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని రెంజల్, వీరన్నగుట్ట గ్రామాలలో ఆకస్మికంగా సందర్శించి గ్రామాలలో ఫీవర్‌సర్వే, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు ఏ మేరకు చేపడుతున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందని, అందువల్ల ఇంటి పరిసరాలలో ప్రతిఒక్కరూ దోమలు, లార్వా వృద్ధి ప్రదేశాలను సకాలంలో గుర్తించి నివారణ చర్యలను చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారులు శ్రావణ్‌కుమార్, రవీందర్, హెల్త్ అసిస్టెంట్ విజయ, వసంత పాల్గొన్నారు.

పడిగెలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

వేల్పూర్ , మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం పదో తరగతి పూర్వవిద్యార్థులు శుక్రవారం సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మిత్రయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా 25 సంవత్సరాల తర్వాత తామందరం ఒకచోట కలువడం సంతోషంగా ఉందని పూర్వవిద్యార్థులు తెలిపారు. అంతకు ముందు పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం 25 సంవత్సరాల క్రితం చదువుకున్న తరగతి గదులను సందర్శించి వారి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. అప్పటి పూర్వ ఉపాధ్యాయులు అనసూయ, నర్సింహులు, వెంకట నర్సయ్య, నారాయణ, రాజేశ్వర్, రవికుమార్, పోశన్నలను శాలువతో పూర్వ విద్యార్థులు సన్మానించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించడం ఆనందంగా ఉందని, సహకరించిన మిత్రయూత్ సభ్యులకు పూర్వ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

కొత్త వంగడాలతో అధిక దిగుబడులు

కోటగిరి,మే30(ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో అధికదిగుబడులు సాధించడంతో సహా రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేందుకు వరి, చెరకు పంటలలో కొత్త వంగడాలను విడుదల చేసినట్లు రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి అంజయ్య తెలిపారు. రుద్రూరు మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేవీకే అధిపతి అంజయ్య మాట్లాడుతూ 2024- 20205 ఆర్‌డీఆర్1162 అనే స్వల్ప కాలిక రకం విడుదల చేశామన్నారు. ఈ రకం రెండు కాలాలకు అనువైనదని ఆయన వివరించారు. వానాకాలంలో 120రోజులు, యాసంగిలో 135రోజుల పంట కాల పరిమితి ఉంటుందన్నారు. ఈ రకాన్ని జేజీఎల్11727, జేజీఎల్ 17004 అను రకాలను సంకరపర్చి రూపొందించామన్నారు. యువ శాస్త్రవేత్తలు కొత్త రకం వంగడాలను తయారు చేయడంపై అభినందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాకేష్, రమ్య రాథోడ్, సౌందర్య పాల్గొన్నారు.



పరిశోధన కేంద్రంలో మాట్లాడుతున్న కేవీకే అధిపతి అంజయ్య

రెంజల్: రైతులు కాలానికి అనుగుణంగా పంటలు పండించుకోవాలని, ఒకే రకమైన పంటలు కాకుండా పంట మార్పిడి వల్ల రైతులు సుస్థిర ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాకేష్, పద్మావతిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. యూరియా, ఇతర ఎరువుల వాడకం, తెగుళ్ళ, పురుగు మందుల వాడకం, విత్తన శుద్ధి మొదలగు అంశాల గురించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, పశువైద్య అధికారి విఠల్, సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

●బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్



మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వసంత్ రెడ్డి

బోధన్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు తప్పకుండా నడుచుకుంటూ రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నడిపి వసంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా నడిపి వసంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, ఆదినారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ వసంత్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన వసంత్ రెడ్డికి ఈ పదవి దక్కడం అభినందనీయమన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, సాలూర అధ్యక్షులు మందర్నా రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శరత్ రెడ్డి, శివాలయం చైర్మన్ హరికాంత్ చారి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న టీజీఈడబ్ల్యూ ఐడీసీఎండీ గణపతిరెడ్డి

కోటగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామశివారులోని పీఎస్ఆర్‌నగర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని శుక్రవారం టీజీఈడబ్ల్యూ ఐడీసీఎండీ గణపతిరెడ్డి పరిశీలించారు. పీఎస్ఆర్ నగర్‌లో సుమారు 15 ఎకరాలకు పైగా స్థలం అందుబాటులో ఉండడంతో పాటు అనువైనదిగా ఉందన్నారు. కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, జుక్కల్‌లో స్థల పరిశీలన పూర్తయిందని, పీఎస్ఆర్ నగర్‌లో స్థలం అనువైనదిగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ షఫీ మియా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ గౌడ్, డీఈ సుబ్బారాయుడు, రవి కుమార్, తహసీల్దార్ గంగాధర్, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, ఏజాజ్ ఖాన్, శ్రీనివాస్ రావు తదితరులున్నారు.

'టీయూసీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండి'

కోటగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జూన్ 1వ తేదీన తలపెట్టిన టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభను కార్మిక ప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ కోరారు. రుద్రూరు మండల కేంద్రంలో బీడీ కార్మికులతో కలిసి శుక్రవారం జిల్లా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ముత్తన్న, లత, లలిత, మౌనిక, జ్యోతి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో కలుషిత నీరు తాగి మేకల మృత్యువాత

ఏర్గట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం కలుషిత నీరు తాగి ఆరుమేకలు మృత్యువాతపడ్డాయని బాధితుడు తెలిపారు. గ్రామానికి చెందిన మెరుగు గంగయ్యకు చెందిన మేకలను ఎప్పటిలాగే మేతకు తీసుకెళ్లగా కలుషిత నీరు తాగి మృత్యువాత పడ్డాయన్నాడు. వాటి విలువ సుమారు 70 వేల ఉంటుందని, ప్రభుత్వం తరపున ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

జక్రాన్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధయక్షుడిగా నవీన్, చిరంజీవి, బాల్‌రెడ్డి, రాజకళ, ప్రధానకార్యదర్శులుగా లత, కుంట శ్రీనివాస్, కార్యదర్శులుగా తిరుపతి రెడ్డి, బనవత్ లక్ష్మణ్, సాయిలు, కమల, మమత, కోశాధికారిగా కుంట భూషణ్‌ను నియమించారు. 20 మందిని మండల కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ తెలిపారు.

'నిబంధనల మేరకు విత్తనాలు అమ్మాలి'



విత్తన డీలర్ల షాపును తనిఖీ చేస్తున్న ఎస్సై, అధికారులు

మోర్తాడ్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విత్తన డీలర్ల షాపులను శుక్రవారం ఎస్సై విక్రం, వ్యవసాయశాఖ అధికారి హరీష్ కుమార్‌లు తనిఖీలు చేశారు. మండల కేంద్రంలోని పలు వ్యవసాయ విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు దుకాణాలలోని రిజిష్టర్‌లను పరిశీలించారు. దుకాణదారులు నిబంధనల మేరకు విత్తనాలు అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో హరీష్‌రావు, ఎస్సై విక్రం, పోలీసులు ఏఈవోలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : వానాకాలం పంటలు వేసుకునే రైతులు తమకు కావాల్సిన విత్తనాలు క్రిమిసంహారక మందులు ఇతరత్ర ఎరువులు ఒకటికి రెండుసార్లు పరిశీలించి కొనుగోలు చేయాలని కమ్మర్‌పల్లి ఎస్.ఐ. అనిల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని విత్తనాలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వలను పరిశీలించారు.

పిప్రిలో బడిబాట కార్యక్రమం

ఆర్మూర్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం మధ్యాహ్న భోజనం అందజేస్తూ ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నామ న్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తు ప్రైయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ శ్రీనివాస్, కాంప్లెక్స్ స్కూల్ హెచ్‌ఎం విశ్వనాథ్, భూషన్ తదిత రులు పాల్గొన్నారు. పెర్కిట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులు, యువకులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు శంకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం

కమ్మర్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ అక్షరాస్యాతే ధ్యేయం గా రాష్ట్ర ప్రభుత్వం ఇందూరు అక్షర లక్ష్మీ పథకాన్ని ఏర్పాటు చేసిందని, నిరక్షరాస్యులు సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి మండల విద్యాధికారి ఎస్.ఆంధ్రయ్య, మండల ఐకేపీ ఏపీఎంకుంట గంగారెడ్డి సూచించారు. శుక్రవారం మండల ఐకేపీ కార్యాలయంలో నిర్వహించి న మండల మహిళాసమాఖ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక నిరక్షరాస్యులను అక్షరాస్యత వైపు మళ్లించడానికి , మధ్యలో చదువు మానివేసిన వారు తిరిగి కొనసాగించుకోవడానికి వీలుగా దూరవిద్యావిధానం అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మామిడి కమల, కార్యదర్శి వాసవి, కోశాధికారి రోజారాణి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగహంసా, ఐకేపీ సిబ్బంది బాలేరావు రవి కుమార్, వర్దం శ్రీనివాస్, భాగ్యలక్ష్మీ, పార్వ, ధనలక్ష్మీ, అలేఖ్య, వర్డ్ స్వచ్ఛందసంస్థ ప్రతినిధి సరిత, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు మండల మహిళా సమాఖ్య సమావేశం

నవీపేట,మే30(ఆంధ్రజ్యోతి): మండల మహిళ సమాఖ్య సమావేశం శనివారం మండల ఐకేపీ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఏపీఎం భూమేష్ గౌడ్ తెలిపారు. మండలంలోని 55గ్రామ సంఘాల అధ్యక్షులు ఉదయం 11:30గంటలకు కార్యాలయంలో జరిగే మహసభకు హజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల మహిళ పదాధికారుల కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని వివరించారు.

'మందకృష్ణ స్వాగత సభను విజయవంతం చేయండి'

బోధన్‌రూరల్,మే 30(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ స్వాగత సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు లింబూరి లక్ష్మణ్ కోరారు. శుక్రవారం ఆయన సాలూర మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అవార్డును స్వీకరించి ఆదివారం వరంగల్‌కు వస్తున్న పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కోరారు.


ఖరీఫ్‌కు భూమి సిద్ధం చేస్తున్న రైతు


అకాల వర్షాలకు మొలకలు వచ్చిన వరి ధాన్యం (ఫైల్)

అయోమయంలో అన్నదాత

» సాగుకు సిద్ధం కావాలా » తడిసిన ధాన్యం అమ్ముకోవాలా?
» రైతు భరోసా ముందే జమ చేయాలని రైతుల వినతి

ఆర్మూర్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో రైతులు అయోమయంలో ఉన్నారు. పంటల సాగు కాలం ముందుకు వచ్చింది. ఇంతవరకు సన్నద్ధం అయింది లేదు. గత సంవత్సరం ఇప్పటికే పసుపు విత్తనం పెట్టేవారు. బోరు బావుల్లో నీరు ఉన్న రైతులు మొక్కజొన్న ముందుగా సాగు చేసేవారు. ఈ సం వత్సరం రెండో వారంలో అడపా దడప, మూడో వారంలో అకాల వర్షాలు కురిసాయి. దీంతో వ్యవసాయ క్షేత్రాల్లోకి నల్లమట్టి, పశువుల పేడ తరలించేందుకు బిజీగా ఉన్న రైతులకు నల్లమట్టి తరలించకుండా అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో చాలా మంది రైతులు తమ భూముల్లోకి నల్లమట్టి, పశువుల పేడా ను తరలించడానికి అవకాశం లభించడం లేదు. అనంతరం అకాల వర్షాలు ఐదురోజుల పాటు కురియడంతో కల్లాలలో, రోడ్లపై ఉన్న వరి ధాన్యం తడిసి పోయి మొలకలు వచ్చి చేతి కిరాకుండ పోయాయి. పంటలు కొనుగోలు కేంద్రాలకు తర లిస్తే పెట్టుబడులకు డబ్బులు వస్తాయని ఆశించిన రైతులకు అకాల వర్షాలు నష్టాలనే మిగిల్చింది.

రైతుకు లేని భరోసా

గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అదనంగా ఎకరాకు రూ.2500 రూపాయలు ఇచ్చి ఏడు వేల ఐదువందలు ఇస్తామని ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించగా రైతులు ఆశపడ్డారు. తీర ప్రభుత్వం నిధులు లేవన్న సాకుతో ఎకరానికి ఆరు వేల రూపాయలే ఇస్తామని చెప్పడం అది నాలుగు ఎకరాల వరకే జమచేయడంతో రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

పెట్టుబడి కాలం రైతుకు కష్టకాలం..

జూన్ మాసం ప్రారంభం అయిందంటే వానాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధం అవుతుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి ధాన్యం, సజ్జపంట మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టాలకు గురయ్యారు. ప్రస్తుతం పంటల సాగుకు చేతులో డబ్బులు లేకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విత్తనాలు, ఎరువుల కొనుగోలు, ట్రాక్టర్ ఖర్చులు ఇతర వ్యవసాయ కూలీల ఖర్చులు మొత్తం కలిపి ఎకరాన సుమారు రూ.25 వేలు, పసుపు సాగుకు ఎకరాన సుమారు రూ.70వేలు రైతుకు అవసరం ఉంటుంది. పూర్తి స్థాయిలో రుణమాఫీ జరుగక బ్యాంకులు పంట రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ప్రైయివేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి డబ్బులు తీసుకువచ్చిన రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదు కోవ డానికి ఖరీఫ్‌లో ముందుగానే పెట్టుబడి సాయం అందజేయాలి. ప్రభుత్వం అందజేసే రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాలో ముందుగానే జమ చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

చెరువు కట్టలు భద్రమేనా?

● జిల్లాలో మరమ్మతులకు నోచుకోని చెరువు కట్టలు ● భారీ వరదలకు గండ్లు పడుతున్న వైనం
● చెరువులపై ఇరిగేషన్ శాఖ దృష్టి సారించాలంటున్న గ్రామస్థులు


నర్వ చెరువు షట్టరును పూడ్చుతున్న గ్రామస్థులు

పెద్దకొడప్‌గల్, మే 30 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ముగిసింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ సారి వానలు ముందస్తుగా కురుస్తున్నాయి. గత కొద్ది రోజుల కిందట వరకు నీరు లేక వెలవెలాడిన చెరువులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిన్న చిన్న గుంతలలోకి నీరు చేరింది. ఇలా చేరిన నీటితో భూమి చిత్తడిగా మారింది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే చెరువుల పై భాగంలో కురిసిన వాననీరంతా చెరవులలోకి చేరుతుంది. దీంతో చెరువులు నిండు కుండలా మారనున్నాయి. ఇంక భారీ వర్షాలు పడితే చెరువులకు గండ్లుపడటం ఖాయమంటున్నారు ఆయా గ్రామాల్లోని చెరువు ఆయకట్టు కిందనున్న రైతులు. గతంలో కూడ భారీ వర్షాలు కురిసిన సమయంలో చెరవులకు గండ్లు పడి నీరంతా వృథాగా పోయింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలతో పాటు ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గత ఏడాది లాంటి ఘటనలు పునరావృతం అయ్యేనా

గత సంవత్సరం ఆశించిన స్థాయిలో వానలు కురియనప్పటికి చాలా చెరు వు లలోకి నీరు చేరలేదు. కొన్ని చెరు వులు, కుంటలు మాత్రం పూర్తి స్థాయి లో నీటితో నిండిపోయాయి. పెద్దకొడప్ గల్ మండలంలోని వడ్లం చెరువుకు భారీగా వరద నీరు రావడంతో తూంకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గండికొట్టడంతో చెరువులోని నీరంతా వృథాగా వెళ్లి పోయింది. దీంతో గ్రామస్థులు స్థానికులకు సమాచారం అందించడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు వచ్చి తూంకు మరమ్మతులు చేయించి నీటి ప్రవాహాన్ని ఆపివేశారు. ఇక మహమ్మద్ నగర్ మండలంలోని సింగీతం రిజర్వాయర్ రిటర్నింగ్ వాల్‌కు గండిపడటంతో నీరంతా దిగువకు వృథాగా పోయింది. దీంతో ఈ విషయాన్ని స్థానికులు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావ్ దృష్టికి తీసుక రావడంతో ఎమ్మెల్యే స్పందించి ఇరిగేషన్ శాఖ అధికారులకు మరమ్మతులు చేయించాలని ఆదేశించడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపాదికన మరమ్మ తులు చేయించారు. దీంతో నీరు ప్రవాహం వెల్లకుండా అరికట్టారు. కొన్నేళ్ల కిందట పెద్ద కొడప్‌గల్ మండలంలోని కాటేపల్లి చెరువు మధ్య భాగంలో గండిపడటంతో చెరువుకట్ట తెగిపోయే స్థితికి చేరింది. దీంతో ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసు కరావడంతో యుద్ధ ప్రాతిపాదికన మర మ్మతులు చేయించారు. దీంతో చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం నుంచి బయటపడింది. ప్రస్తుతం ఈ చెరవు కట్టపై ఇప్పటికి కట్ట కుంగిన ఆనవాళ్లు కనబడుతాయి.

నర్వ పాత చెరువు

తూం గండిని పూడ్చుకున్న ఆయకట్టు రైతన్నలు

ఇటీవల కురిసిన వర్షాలకు నర్వపాత చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. అయితే చెరువుకు గల తూంకు షట్టర్లు లేక పోవడంతో వచ్చిన నీరంతా పంట పొలాల మీదుగా వృథాగా పోతుందని గమనించిన ఆయకట్టు రైతన్నలు ఎవరికో చెప్తే వారు వచ్చి మరమ్మతులు చేయడానికి సమయం పడుతుందని భావించి ఆయకట్టు రైతన్నలు ఏకమై తూం గండిని ఇసుక బస్తాలతో పూడ్చి వేశారు. ప్రస్తుతానికి నీరు వృథా అరికట్టినా రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే ఈ సమస్య పునరావృతం అవుతుందని, తూంకు షట్టర్లు బిగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఇలా చెప్పు కుంటూ పోతే ఇంక వెలుగులోకి రాని చెరువులెన్నో ఉండచ్చు. రానున్నది వానాకాలం భా రీ వర్షాల కారణంగా చెరువులు నిండితే చెరువు కట్టలకు గండ్లు పడకుండ ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల అయకట్టు రైతన్నలు కోరుకుంటున్నారు.


గతంలో మరమ్మతులకు గురైన కాటేపల్లి చెరువు కట్ట


తూము షట్టర్‌కు ఇసుక సంచులతో పూడ్చిన దృశ్యం

ఇరిగేషన్ ఈఈ ఏమంటున్నారంటే..

ఈ విషయం గురించి ఇరిగేషన్ ఈఈ సోలోమన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, తమకు చెరువు కట్టలు బాగా లేవని ఏ మండలం నుంచి రైతులు గాని తమ శాఖ అధికారులు గాని దృష్టికి తీసుకరాలేదని తెలిపారు. అందుకే చెరువు కట్టల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపలేదని, వానలకు చెరువులు నిండి ఏదైనా చెరువుకు గండి పడితే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. నియోజక వర్గంలో ఉన్న చెరువులపై తమ శాఖకు చెందిన లష్కర్ల పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

సాగు కోసం రైతన్న సమాయత్తం

» సన్న వరి సాగా.. దొడ్డు వరి సాగా?! అన్న డైలామాలో రైతులు
» సన్నాల బోనస్ కోసం ఎదురు చూపులు

పెద్ద కొడప్‌గల్, మే 30 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ ముగిసింది. రబీ సీజన్‌లో రైతులు తాము పంట చేల్లో పండించిన పంటలను అమ్ముకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మే నెలలోనే వర్షాలు ముందస్తుగా కురుస్తున్నాయి. దీంతో భూమిని నమ్ముకుని ఉండే రైతన్నలు యథాతథంగా ఖరీఫ్ పంట సాగు కోసం సన్నద్ధమవుతున్నారు. గతంలో అయితే జూన్ నెలలో మృగశిర కార్తె ప్రారంభం అయిన తర్వాత చేలను దున్ని పంట సాగు చేసేవారు. అయితే మారిన పరిస్థితుల దృష్ట్యా ఇప్పటి నుంచే పంట సాగుకు సిద్ధమవుతున్నారు రైతన్నలు. జుక్కల్ నియోజక వర్గంలో నిజాంసాగర్ మండలం తో పాటు పిట్లం మండలంలోని కొన్ని గ్రామాలు కమాండ్ ఏరియాలోకి రాగా మినహా మిగతా మండలాలు నాన్ కమాండ్ ఏరియాలోకి వస్తాయి. పెద్ద కొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లి మండలాలలో అధికంగా నల్ల రేగడి భూములు ఉన్నందున ఈ ప్రాంత రైతన్నలు ఆరుతడి పంటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఇదే మండలాలలోని బోరు బావులు ఉన్న రైతులతో పాటు బిచ్కుంద, డోంగ్లి, పిట్లం మండలాల మంజీరా పరివాహక ప్రాంత రైతులు వరి పంట సాగుపై ఆసక్తి చూపుతారు. దీంతో ఈ ప్రాంత రైతులు కొన్నేళ్లుగా దొడ్డు రకం వరిని సాగు చేస్తున్నారు.

అయోమయంలో రైతులు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా సన్నాలకు క్వింటాలుకు 5 వందల రూపాయల బోనస్ ఇస్తా మని ప్రకటించింది. గత ఖరీఫ్ సీజన్ లో మాటిచ్చిన విధంగా సన్నాలు సాగు చేసిన రైతన్నలకు బోనస్ అందజేసింది. దీంతో రబీ సీజన్‌లో కూడా రైతన్నలు బోనస్ వస్తుందని నమ్మకంతో సన్నాలను సాగు చేశారు. అయితే నేటి వరకు బోనస్ కొందరికే అందింది. మిగతా వారికి ఇంక బోనస్ అందకపోవడంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో ఏ రకం వరిని సాగు చేయాలన్న సంశయంలో పడిపోయాడు రైతన్న. సన్న రకం సాగు చేస్తే దిగుబడి తక్కువ వస్తుందని బోనస్‌తో దానిని సరిపెట్టుకోవ చ్చని చూస్తున్నారు రైతన్నలు. ఇక దొడ్డు రకంను సాగు చేస్తే దిగుబడి బాగా వచ్చిన బోనస్ అందదేమే అని ఆలోచన చేస్తున్నారు రైతన్నలు. తాము ఏ రకం వరిని సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారుల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. సన్నరకానికి బోనస్ వస్తుందా లేదా ఆరా తీస్తున్నారు.


వరి సాగు దృశ్యం

బోనస్ డబ్బుల కోసం రైతన్నల ఎదురుచూపులు

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఐకేపీ, సహకార సంఘాల ద్వారా 3 లక్షల 77 వేల 716 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని అధికారులు తెలిపారు. ఇందులో 1 లక్ష 98 వేల 608 మెట్రిక్ టన్నుల దొడ్డు సరుకు కాగా, 1 లక్ష 79 వేల 108 మెట్రిక్ టన్నుల సన్న సరుకు ఉన్నట్లు సమాచారం. రైతుల దగ్గర కొనుగోలు చేసిన వరి ధాన్యం డబ్బులు రూ.931.44 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. సన్నాలకు సంబంధించి 87 కోట్ల బోనస్ డబ్బులు కూడా రైతుల ఖాతాలో జమ చేశారు. అయితే మిగతా రైతులకు నేటి వరకు బోనస్ అందకపోవడంతో వాటి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం రానున్న రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా వరి సాగుపై వ్యవసాయ శాఖ అధికారులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

రబీలో 50 ఎకరాల్లో వరి విత్తన సాగు

» మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో అకాల వర్షాలకు తడిసి, మొలకలొచ్చి ముక్కిపోయిన వరి సీడ్ ధాన్యం » ధాన్యం కల్లాలకు చేరుకున్నప్పటి నుంచి ఎడతెరిపి లేని అకాల వర్షం
» 60 శాతం తడిసి మొలక లొచ్చి, ముక్కిపోయిన వరి ధాన్యం » క్షేత్రంలో భారీగా నష్టం


అకాల వర్షానికి తడిసి మొలకలొచ్చి ముక్కిపోయిన వరి సీడ్ ధాన్యం


వర్షానికి తడిసి ముక్కిపోయిన వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా కూలీలు

నాగిరెడ్డిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): మాల్తుమ్మెద ప్రభుత్వ విత్తన క్షేత్రంలో ప్రస్తుత రబీలో సాగు చేసిన వరి సీడ్ ధాన్యం ఇటీవల వారం, పది రోజులుగా కురిసిన అకాల వర్షం కారణంగా తడిసి ముద్దయి వరి ధాన్యానికి మొలకలొచ్చి ముక్కిపోయింది. దీంతో క్షేత్రంలో తీవ్ర నష్టం వాటిల్లింది. రబీ సీజన్‌లో క్షేత్రంలో 50 ఎకరాలలో కేఎన్ఎం 1638 రకం వరి విత్తనాన్ని సాగు చేశారు. పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల అనంతరం కొంత ఆలస్యంగా పంటను క్షేత్రంలో అధి కారులు 15 రోజుల క్రితం వరి పంట కోతను ప్రారంభించారు. ఐదారు రోజుల పాటు పంట కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని కల్లాలకు తరలిం చారు. కల్లాలకు ధాన్యం చేరుకున్నప్పటి నుంచి అకాల వర్షాలు కురవ డంతో, ధాన్యం తడవకుండా క్షేత్రం సిబ్బంది ధాన్యంపైన టార్పాలిన్‌లు కప్పినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడంతో చాలా వరకు వరి విత్తన ధాన్యం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యం రంగు మారి, మొలకలొచ్చి, ముక్కిపోయింది. క్షేత్రంలో 50 ఎకరాలలో పండించిన సీడ్ ధాన్యం సుమారు 60 శాతం వరకు తడిసి ముద్దై, మొలకలొచ్చి ముక్కిపోయింది. క్షేత్రంలో సాగు చేసిన 50 ఎకరాలలోని వరి విత్తన పంట చేతి కొచ్చాక అకాల వర్షం కారణంగా 60 శాతం వరకు విత్తన వరి ధాన్యం వర్షానికి తడవడం కారణంగా ధాన్యం చెడిపోవడంతో క్షేత్రానికి తీరని నష్టం వాటిల్లింది. ఈ క్షేత్రంలో ఉత్పత్తి చేసిన వరి విత్తనాలను తెలంగాణ రాష్ట్ర సీడ్‌కు పంపించాల్సి ఉండగా ప్రస్తుతం క్షేత్రంలో సాగు చేసిన వరి విత్తనం సీడ్ వర్షాలకు తడిసిపోయి చెడిపోవడంతో ఈ ధాన్యం సీడ్‌కోసం పనికి రాదని రాష్ట్ర సీడ్ అధికారులు దీనిని తీసుకోవడానికి నిరాకరించినట్లు క్షేత్రం సిబ్బంది తెలిపారు. దీంతో నాన్ సీడ్ కింద ఈ ధాన్యాన్ని విక్రయించే ఆలోచనలో క్షేత్రం సిబ్బంది ఉన్నారు.

● తడిసిన ధాన్యం ఆరబెట్టే పనుల్లో నిమగ్నం

అకాల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యాన్ని, మొలకలు వచ్చి ము క్కిపోయిన ధాన్యాన్ని క్షేత్రం అధికారులు ప్రస్తుతం ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. శుక్రవారం వాతావరణం అనుకూలించడంతో ఉదయం నుంచి కూలీల చేత ధాన్యాన్ని ఆర బెడుతూ గోదాంలో నిల్వ ఉంచుతున్నారు. తడిసిన ధాన్యాన్ని, ముక్కి పోయిన ధాన్యాన్ని ఎండకు ఆర బెడుతున్నారు.

● ధాన్యం తడిసిపోవడంతో క్షేత్రానికి భారీ నష్టం

క్షేత్రంలో 50 ఎకరాలలో సాగు చేసిన మేలు రకమైన వరి సీడ ధాన్యం సుమారు 60 శాతం వరకు తడిసి ముద్దై, మొలకలొచ్చి ముక్కి పోయింది. అకాల వర్షం కారణంగా 60 శాతం వరకు వరి విత్తన ధాన్యం వర్షానికి తడవడం కారణంగా ధాన్యం చెడిపోవడంతో క్షేత్రానికి తీరని నష్టం వాటిల్లింది. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి క్షేత్రం లో 50 ఎకరాలలో వరి విత్తన పంటను సాగు చేశారు. పంట మొత్తం చేతికి వచ్చాక, వరి ధాన్యం కల్లాలకు చేరుకున్నాక అకాల వర్షానికి ధాన్యం తడిసి తీవ్ర నష్టం వాటిల్లింది.


తడిసి ముక్కిపోయిన వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న కూలీలు

బాన్సువాడ బస్టాండ్‌లో సమస్యల తిష్ఠ

» పెచ్చులూడుతున్న బస్టాండ్ పైకప్పు » పరిసరాల్లో చెత్త » కానరాని అధికారుల చర్యలు

బాన్సువాడ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణప్రాంగణం అంటే ప్రజలు తమ ప్రయాణాలను మొదలు పెట్టడానికి లేదా ముగించడానికి ఉపయోగపడే రవాణా కేంద్రం. ఇక్కడ ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. కానీ బాన్సువాడ ప్రయాణ ప్రాంగణం అందుకు భిన్నంగా మారింది. అరకొర వసతులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణీకుల సమస్యలను పరిష్కరించే అధికారులు కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెచ్చులూడుతున్న బస్టాండ్ పైకప్పు

పెచ్చులూడుతున్న బస్టాండ్ పైకప్పు..

బాన్సువాడ బస్టాండ్‌కు 1985 ఆగష్టు 9న శంకుస్థాపన జరిగింది. కాగా 1988, మే 5న అప్పటి ఎమ్మెల్యే ఎస్‌వీఎల్ నరసింహారావు ప్రారంభించారు. బస్టాండ్ నిర్మాణం చేపట్టి దాదాపుగా 37 సంవత్సరాలు దాటింది. నాటి నుంచి నేటి వరకు అడపాదడపా ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మత్తులు మాత్రమే చేపట్టారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం బస్టాండ్ పైకప్పు పెచ్చులూడుతూ దర్శనమిస్తోంది. రాబోయే వర్షాకాంలో మరింత పెచ్చులూడే అవకాశాలున్నాయి. అధికారులు బహుశా ఆ వైపుకు కనీసం కన్నెత్తైనా చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

బాన్సువాడ బస్టాండ్‌లో రద్దీ ..

బాన్సువాడ మున్సిపాలిటీగా మారిన తర్వాత రద్దీ బాగా పెరిగిపోయింది. ప్రతీ నిత్యం చుట్టు పక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రయాణీకులు వివిధ పనుల నిమిత్తం బాన్సువాడకు విచ్చేసి పనులు చక్కదిద్దుకుంటుంటారు. పనులు ముగించుకుని బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షణ చేయాలంటే స్థలం కూడా సరిపడా లేకుండాపోయింది. చాలా మంది ప్రయాణికులు బస్సుల కోసం ఆరుబయటే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు బాన్సువాడ బస్టాండ్‌లో కేవలం నాలుగు ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉండేవి. ఆ తర్వాత ఖాళీ స్థలంలో నిర్మాణం చేపట్టడంతో ప్లాట్‌ఫాంల సంఖ్య పెరిగింది. అయినప్పటికీ ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడంలేదు.



బాన్సువాడ బస్టాండ్ ఇదే

పరిసరాల్లో చెత్తా, చెదారం

బాన్సువాడ బస్టాండ్ పరిసరాలు చెత్తా ,చెదారాలతో దర్శనమిస్తున్నాయి. ఎప్పటికపుడు శుభ్రం చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. తాగేనీరు స్థలం శుభ్రంగా లేపోవడంతో ప్రయాణీకులు నీరు తాగాలంటేనే జంకుతున్నారు. ఇదిలా ఉండగా బస్టాండ్‌లో ప్రయాణీకులు కూర్చోవడానికి కుర్చీలు కూడా కరువయ్యాయి. అధికారులు చొరవచూపి బాన్సువాడ బస్టాండ్‌లో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

రేపు హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

సుభాష్‌నగర్, మే30 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లాల జూనియర్ పురుష, మహిళా క్రీడాకారులను ఎంపికలను జూన్ 1న నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగామోహన్ చక్రు, పింజ సురేందర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలూర్ మండలం కల్లడి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 1-1-2006 నుంచి 31-12-2009 జన్మించిన వారు ఉండాలని, ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రాలతో ఆదివారం ఉదయం 8గంటలకు జెడ్పీహెచ్ఎస్ కల్లడి మైదానంలో హాజరు కావాలని తెలిపారు. ఇందులో ప్రతిభకనబర్చిన క్రీడాకారులను జూన్ 4, 5, 6 తేదీల్లో నల్గొండ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. మిగతా వివరాల కోసం గట్టాడి రాజేష్ 9642535535, 9440441757ను సంప్రదించాలని కోరారు.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలు

నిజామాబాద్ అర్బన్, మే30 (ఆంధ్రజ్యోతి): జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరుగనున్న పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద అండర్ సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్‌ను అమలు చేయనున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడ కూడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా నిరోధించాలనే ఉద్దేశ్యంతో ఈ సెక్షన్‌ను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద గుమ్మిగూడరాదని, నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగవద్దని, ఈనెల 3 నుంచి 13 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పరీక్ష కేంద్రాల పరిసరాలలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆయన ఆదేశాలు ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



వేదికపై 2005-2006 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

ధర్పల్లి, మే30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒన్నాజీపేట్ గ్రామంలో గల పూర్వ ఎస్సెస్సీ విద్యార్థులు ఒక్క చోటకి చేరారు. శుక్రవారం గ్రామంలోగల ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2005-06 ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులకు ఈ సందర్భంగా సన్మానించారు. చాలా రోజుల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు సంతోషంగా గడిపారు. అందరూ కలిసి ఉత్సాహంగా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పూర్వవిద్యార్థుల కలయిక సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

'వేసవిలోనూ నిరంతర విద్యుత్‌ను అందించాం'

సుభాష్‌నగర్, మే30 (ఆంధ్రజ్యోతి): వేసవి కార్యాచరణ ప్రణాళిక విజయవంతంగా అమలు చేశామని నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ నుంచి వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకొని అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవడంతో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించామని పేర్కొన్నారు. ఓవర్‌లోడ్ పెరిగే అవకాశం ఉన్నచోట మామిడిపల్లి, చౌట్‌పల్లి సబ్‌స్టేషన్‌లలో 5.0 ఎంవీఏ, 3.15 ఎంవీఏ, నిజామాబాద్ నగరంలో పలు సబ్‌స్టేషన్‌లలో 8.0 ఎంవీఏ, 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 242 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని, 202 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని వెల్లడించారు. ఇప్పటివరకు 35.337 కిలోమీటర్ల మేర 26 సబ్‌స్టేషన్లకు ఇంటర్‌లింకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశామని, టెక్నికల్ సమస్యలు సైతం గణనీయంగా తగ్గాయని తెలిపారు. ఉద్యోగులు సైతం నిబద్ధతతో పనిచేయడంతోనే విజయం సాధించామని పేర్కొన్నారు.

క్రమ శిక్షణ కమిటీ సభ్యుడికి సన్మానం

నిజామాబాద్ అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ నూతనంగా ప్రకటించిన క్రమశిక్షణ కమిటీలో సభ్యుడిగా నియమితులైన నగరానికి చెందిన జీవీ రామకృష్ణను నగరానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. టీపీసీసీ కార్యదర్శి రాంభూపాల్, నాగరాజు రామకృష్ణను సన్మానించిన వారిలో ఉన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(బీ)లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు వాసుబాబు, సోమనాథ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభ్యున్నతికి ఎమ్మెల్యే శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, మురళి, మురారి, పిచ్చయ్య, యాదయ్య, బాలక్రిష్ణ, బాబు, మురళి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నిజామాబాద్ అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నగరంలోని హైదరాబాద్ రోడ్‌లోగల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వేల్పూర్ మండలం పడకల్‌కు చెందిన కవిత (32)ను గురువారం వెన్నుపూస ఇబ్బంది ఉందని తీసుకురాగా వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. దీంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డాక్టర్లు ఆపరేషన్ చేశారని, ఆపరేషన్ అనంతరం వెంటిలేటర్‌పై ఉంచారని, శుక్రవారం ఉదయం తన భార్య మృతి చెందిందని డాక్టర్లు చెప్పారని మృతురాలి భర్త సురేష్ తెలిపాడు. ఆపరేషన్ చేయడంలో డాక్టర్లు నిర్లక్ష్యం వహించడం వల్లే తన భార్య మృతి చెందిందని, ఆసుపత్రి ఎదుట భర్త సురేష్‌తో పాటు బంధువులు ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలానికి నిజామాబాద్ సీఐ శ్రీనివాస్‌రాజు, ఎస్సైలు చేరుకొని వివరాలు సేకరించారు. మృతిపై కుటుంబసభ్యులు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ప్రతిభ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ మోతిలాల్ జాదవ్‌ను వివరణ అడగా వెన్నుపూస ఆపరేషన్ చేయగా రక్తస్రావం ఎక్కువై మృతిచెందినట్లు తెలిపారు.

'పట్టాదారులకే భూములు చూపించాలి'

సిరికొండ, మే30 (ఆంధ్రజ్యోతి): సిరికొండలో పట్టాలు పొందిన పేద రైతులకే భూములు చూపించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్.రమేష్ తహసీల్దార్ రవీందర్‌రావును కోరారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు పట్టాదారులతో ధర్నా చేశారు. సిరికొండలో గల 532 సర్వే నెంబర్‌లో పట్టాలు పొందిన సుమారు 162 మంది లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

స్వయం ఉపాధి శిక్షణ తరగతులను ప్రారంభించిన డీడీఎం

డిచ్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రీషియన్, ఫొటోగ్రఫీ శిక్షణా తరగతులను శుక్రవారం నాబార్డు డీడీఎం ప్రవీణ్ ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం నాబార్డు డీడీఎం ప్రవీణ్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి అయిన తర్వాత పొందిన శిక్షణా తరగతులు స్వయం ఉపాధికి ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. నేర్చుకున్న శిక్షణను వదిలేయకుండా జీవితంలో ఉపాధి పొందేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో ఎలక్ట్రీషియన్, ఫొటోగ్రఫీ రంగానికి మంచి ప్రాధాన్యత ఉందని అన్నారు. దీనిద్వారా ఆర్థిక ఎదుగుదలకు దోహదం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం

కార్తికేయ ఏజెన్సీకి నోటీసులు

సుభాష్‌నగర్, మే30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించనందుకు కార్తికేయ ఏజెన్సీకి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 29న వేతనాల చెల్లింపు విషయంలో హాజరుకావాలని లేఖ పంపినా హాజరుకాకపోవడంతో మరొకరోజు హాజరుకావాలని తెలిపినా రావకపోవడంతో నోటీసులు పంపినట్లు పేర్కొంది. ఏడు రోజుల్లో షోకాజ్ నోటీసుకు సమాధానం ఇవ్వాలని లేనిచో చట్టపరమైన చర్యలు చేపడుతామని హెచ్చరించింది. వేతనాల చెల్లింపు విషయంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ గత కొంత కాలంగా లేబర్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. పిలిచినా ఏజెన్సీ నిర్వాహకులు చర్చలకు రాకపోవడంతో నోటీసులను జారీ అయ్యాయి.

డిగ్రీ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యూలర్, బ్యాక్‌లగ్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ సీబీసీఎస్ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, 2,4,6వ సెమిస్టర్ రెగ్యూలర్ 1,3,5 సెమిస్టర్ బ్యాక్‌లగ్ 2020-2024లో జరిగిన బ్యాక్‌లాగ్ పరీక్షలు 13వ రోజు ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 32 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 337 విద్యార్థులకు 319 హాజరు కాగా, 18 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 1209 మందికి గాను 1085 హాజరయ్యారని వెల్లడించారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే

సిరికొండ, మే30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో శనివారం జరిగిన ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయ స్వామి దయతో ఈసారి బాగా వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పాడి పంటలు బాగుండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. ఆయనవెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎర్రన్న, మండల అధ్యక్షుడు బాకారం రవి, కిసాన్‌ఖేత్ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులున్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న డీఈవో

కనీస పరిజ్ఞాన విద్యను నేర్చుకోవాలి: డీఈవో

నిజామాబాద్ కల్చరల్, మే30 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు వయస్సుతో సంబంధం లేకుండా కనీస పరిజ్ఞానం విద్యను నేర్చుకోవాలని అప్పుడే సంపూర్ణ అక్షరాస్యత సాధించిన వాళ్లము అవుతామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. శుక్రవారం అక్షర కిరణం ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో న్యూఅంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు నేర్చుకుంటేనే ఉన్నత స్థాయి చేరుకోగలమని తల్లిదండ్రులు కన్న కలలు సాకారం అవుతుందని అన్నారు. మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా అక్షర జ్ఞానంతో పాటు కూడికలు, తీసివేతలు నేర్చుకోవడం మంచిదని అన్నారు. నాడు అక్షరాస్యతను పెంచడానికి కళాకారులు గ్రామాలు, పల్లెల్లో తిరుగుతూ సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారని అన్నారు. అక్షర కిరణ ఉద్యమం ద్వారానే తన తల్లి అక్షర జ్ఞానం నేర్చుకొని సంతకం పెట్టుకునే స్థాయికి వచ్చిందని స్వీయ అనుభవాన్ని పంచుకున్నారు. కళాకారులు ప్రజలకు మరింత చేరువై చదువు వల్ల కలిగేటువంటి లాభాలను వివరించాలని సూచించారు. అనంతరం పలువురు కళాకారులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అక్షర కిరణం సమన్వయ కమిటీ సిర్పలింగం అధ్యక్షత వహించారు. జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ, వయోజన విద్య ఉపసంచాలకులు గోవింద్‌రావు, తెలంగాణ సాంస్కృతిక కేంద్రం టీపీఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు, తాటి వీరేశం, సుధాకర్‌రావు, రెడ్డి రాజయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేందర్‌గుప్త, మాజీ వయోజన విద్య ప్రాజెక్టు అధికారి జగద య్య, ఆల్ పెన్షనర్స్ జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రావు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

నిజామాబాద్ కల్చరల్, మే30 (ఆంధ్రజ్యోతి): భక్తుల గోవింద నామస్మరణలు, వేదమంత్రోచ్ఛరణలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. నగరంలోని ఆర్యనగర్‌లో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజైన శుక్రవారం కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాలను ఉంచి కల్యాణ వేడుకలను వేదపండితులు తులసీ మురళీధరచార్య వేదమంత్రాలు పఠించగా అర్చకులు కళ్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు.

'తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు'

నిజామాబాద్ అర్బన్, మే30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తాము సీబీఎస్ఈ అనుబంధమని, సీబీఎస్ఈ విధానాన్ని అనుసరిస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నాయని, వారిని నమ్మవద్దని సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల సంఘం ప్రతినిధులు అన్నారు. నగరంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ స్కూల్‌లో శుక్రవారం సంఘం అధ్యక్షుడు సంతోష్ కుమార్, కార్యదర్శి ముజీబ్, సభ్యులు మారయ్యగౌడ్, పవన్‌కుమార్, లక్ష్మీనర్సింహస్వామి విలేకరులతో మాట్లాడారు. సీబీఎస్ఈ పేరుతో చాలాపాఠశాలలు విద్యార్థులను, తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్నాయన్నారు. సీబీఎస్ఈ అనుబంధం కోసం దరఖాస్తు చేసుకున్న మాత్రాన సీబీఎస్ఈ అనుబంధ హోదా లభించదని, సీబీఎస్ఈ నుంచి అనుమతి వచ్చాకే అడ్మిషన్లు తీసుకోవాలని అన్నారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నుంచి అధికారికంగా అనుబంధం పొందిన పాఠశాలలకే సీబీఎస్ఈ పాఠశాలుగా వ్యవహరించే హక్కు ఉందని పేర్కొన్నారు. జిల్లాలో సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలు నవ్యభారతి గ్లోబల్ స్కూల్, ఎస్ ఎస్ఆర్ డిస్కవరీ, ఎస్ఎస్ఆర్ స్కూల్ (జన్నేపల్లి), నాలెడ్జ్ పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్, ప్రెసిడెన్సీ స్కూల్, సెయింట్ ఆన్సస్ స్కూల్ (ఆర్మూర్), క్షత్రీయ స్కూల్(ఆర్మూర్) మాత్రమేనని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్లలో చేర్పించే ముందు సీబీఎస్ఈ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు. ఈ విషయమై కలెక్టర్, డీఈవోలకు ఫిర్యాదు చేస్తామన్నారు. కొంతమంది విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో సీబీఎస్ఈ సిటీ కోఆర్డినేటర్ భాస్కర్ మెరిగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీబీఎస్ఈ గుర్తింపు పొందిన పాఠశాలల ప్రతినిధులు

ఉపాధి శిక్షణ కేంద్రం పరిశీలన

డిచ్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. కేంద్రంలో అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను కోర్సు డైరెక్టర్ రవికుమార్ వివరించారు. ఇంతవరకు నిరుద్యోగులు పొందిన శిక్షణ, ఉపాధి శిక్షణలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పొందేందుకు విధించిన అర్హతలు, అడ్మిషన్ల ప్రక్రియ వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎలక్ట్రీషియన్ శిక్షణ ఇస్తున్నామని కోర్సు డైరెక్టర్ ఢిల్లీ ప్రతినిధుల బృందానికి వివరించారు. అనంతరం తరగతి గదులను స్వయంగా పరిశీలించారు. వారివెంట ఎంపీడీవో భుక్యలింగం నాయక్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ ఈవో రాధిక, జూనియర్ అసిస్టెంట్ రజత్ కుమార్, ఏఈవో సతీశ్, పాల్గొన్నారు.

ఘన్‌పూర్, మిట్టపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రారంభం

డిచ్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): వండలంలోని ఘన్‌పూర్, మిట్టపల్లిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించుకొని అందరికీ ఆదర్శంగా నిలవాలని యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చౌకి వెంకటేశ్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్‌లు అన్నారు. ప్రతీ ఒక్కరు నాణ్యతతో పనులు చేయించుకోవాలని కోరారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేరుస్తున్నరని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షాదుల్లా, శంకర్ గౌడ్, సాగర్, దేవేందర్, లింబాద్రి, ప్రసాద్, మిట్టపల్లిలో హబీబ్ ఖాన్, రాంచందర్ గౌడ్, వడ్ల గంగాధర్, మాజీ ఎంపీపీ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఘన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇంటి పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సూది మందుకూ దిక్కులేదు!

(3వ పేజీ తరువాయి)

కిడ్నీ రోగులకు ఇచ్చే లాసిక్స్ గత రెండు వారాల నుంచి ప్రభుత్వం నుంచి సరఫరా కావడం లేదు. దీని విలువ కేవలం రెండు రూపాయలే ఉంటుంది. అలాగే ఐసీయూ పేషెంట్లకు ఇచ్చే పొటాషియం క్లోరైడ్ కూడా అందుబాటులో ఉండటం లేదు. దీని ధర కేవలం రూ.4 కాగా అలాగే గర్భిణీలకు ప్రసవం సమయంలో రక్తస్రావం కాకుండా ఇచ్చే ట్రానెక్సా సైతం లేదు. రూ.15 విలువైన ఈ ఇంజెక్షన్‌ను అత్యవసర పరిస్థితుల్లో బయటి నుంచి తెప్పిస్తున్నారు. అలాగే సోడియం లెవల్స్ తగ్గిన పేషెంట్లకు ఇచ్చే సోడియం బైకార్బొనేట్ ఇంజెక్షన్, రూ.10 విలువ చేయగా ప్రభుత్వం నుంచి సప్లై కావడం లేదు. రూ.300 విలువైన మిథైల్ ప్రెడ్నీ సోలోన్ ఇంజెక్షన్ అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆక్సిజన్ ఫిల్లింగ్ కూడా అందుబాటులో ఉండకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించేటప్పుడు ఇబ్బందులు వస్తున్నాయి. ఆసుపత్రిలో ఎక్స్‌రే మిషన్లు సైతం సరిగ్గా పనిచేయడం లేదు. ఎక్స్‌రే నిర్వహించే ఆపరేటర్లు సైతం అందుబాటులో ఉండకపోవడంతో గంటలకొద్దీ రోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉన్నాయి. బ్లడ్ టెస్టులకు సైతం రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నాలుగు రోజులు బ్లడ్ టెస్టులు చేస్తూ మరో మూడు నాలుగు రోజులు టెస్టులు చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం నుంచి సరఫరా కాని మందులు కొనుగోలు చేస్తున్నాం..

● శ్రీనివాస్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

ప్రభుత్వం నుంచి సరఫరా కావాల్సిన మందులను కొనుగోలు చేసి రోగులకు అందజేస్తున్నాం. ఆసుపత్రి మరమ్మతులకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. ఇప్పటికే సంబంధిత మంత్రి సమీక్ష నిర్వహించారు. నిధులు విడుదల కాగానే మరమ్మతు పనులు చేపడుతాం.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

(3వ పేజీ తరువాయి)

రూ. లక్ష, రూఫ్ లెవల్‌కు మరో రూ.లక్ష, రూఫ్ వేశాక రూ.2లక్షలు, నిర్మాణం పూర్తయ్యాక మిగత లక్ష రూపాయలు ఖాతాలో జమ చేస్తామన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఎలాంటి అపోహలకు లోను కాకుండా తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. పైలెట్ గ్రామాలలో రూఫ్‌లెవల్, లెంటల్ లెవల్ వరకు నిర్మాణాలు పూర్తి చేసుకున్న 355మందికి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీపీవో శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ ఎంపీపీ పవన్, నాయకులు కొట్టం మనోహర్, శ్రీనివాస్‌రావు, రాంబాబు, పత్తి లక్ష్మణ్, కూచి సిద్దు, బర్ల మధు, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో చందర్ తదితరులు ఉన్నారు.

హంగర్గ ఫారంలో బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రారంభం

పోతంగల్ మండలంలోని హంగర్గ ఫారం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ సేవలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఏడాది క్రితం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సేవలు అందించాలని బీఎస్ఎన్ఎల్ సేవల కోసం పలువురు వినియోగదారులు ఎదురుచూశారు. గ్రామీణ ప్రాంతాలలో సెల్‌ఫోన్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు బీఎస్ఎన్ఎల్ శాఖ కృషి చేస్తుందని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మాజీ సర్పంచ్ ఏజాజ్ ఖాన్, నాయకులు దిలీప్ కుమార్, బీఎస్ఎన్ఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

టీఎంఆర్‌పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎంఆర్‌పీఎస్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లాని శివ, గంగారాంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాకేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటుచేసిన టీఎంఆర్‌పీఎస్ కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథులుగా వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు హాజరై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గగన్‌రాజు, ఉపాధ్యక్షుడిగా లింగం, టౌన్ అధ్యక్షుడిగా మల్లేశం, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా దుర్గయ్య, మహిళా అధ్యక్షురాలిగా గడ్డం జ్యోతి, ఆర్మూర్ మండలం నందిపేట్ మండల ఇంచార్జిగా నడిపి చిన్నయ్య, మాదిగ విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షులుగా అఖిల్‌ను ఎన్నుకోవడం జరిగింది. అంతకుముందు రిజర్వేషన్ పోరాటంలో అమరులైన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పలువురికి దళితరత్న అవార్డులను అందజేశారు. దళితరత్న అవార్డు అందుకున్న వారిలో కోటేశ్వర్‌రావు, సుదాసు, డాక్టర్ పులిజైపాల్, అబ్బులు, బి.విజయ్‌కాంత్ రావు, బుర్ర లక్ష్మణ్, దుర్గయ్య, సాయిలు, లత, గడ్డం జ్యోతి, ఉన్నారు. కార్యక్రమంలో టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజ్, నాయకులు పీటర్, భద్రి, రాములు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.140	రూ.250	రూ. 270

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.96,300	రూ.88,600	రూ.1015

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్) (10.55, 7.20)
: కరాటే కిడ్ లెజెండ్స్ (2.25)
: బూల్ చౌక్ మాఫ్ (హిందీ) (4.40, 10.50)

స్ర్కీన్-2 : బూల్ చౌక్ మాఫ్ (హిందీ) (11.00)
: సింగిల్ (1.40, 7.35)
: భైరవం (4.25, 10.20)

స్ర్కీన్-3 : కరాటే కిడ్ లెజెండ్స్ (తెలుగు) (11.25)
: షష్టిపూర్తి (1.40)
: ఘటికాచలం (4.50)
: కరాటే కిడ్ లెజెండ్స్ (ఇంగ్లీష్) (7.45, 10.00)

స్ర్కీన్-4 : ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (11.05, 4.15)
: శుభం (1.35)
: ఖలేజా (6.45)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (ఇంగ్లీష్) (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : ఖలేజా (10.25, 4.30)
: భైరవం (1.30, 7.35, 10.35)

స్ర్కీన్-2 : ఘటికాచలం (11.00)
: ఖలేజా (1.30, 7.30, 10.30)
: షష్టిపూర్తి (4.35)

స్ర్కీన్-3 : లవ్ కరూ యార్ (హిందీ) (11.00)
: నారీవేట (1.30)
: ఘటికాచలం (4.20)
: సింగిల్ (7.30)
: షష్టిపూర్తి (10.20)

లలితామహల్ : భైరవం (11.15, 2.15, 6.15, 9.15)

దేవి : కరాటే కిడ్ లెజెండ్స్ (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : ఖేసరి చాప్టర్-2 (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : ఖలేజా (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్